సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 22 । జనవరి । 2023



ఓం శనీశ్వరాయ నమః 9లో▸

జిల్లా కేంద్రంలోని శనీశ్వర ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. శని అమావాస్య పురస్కరించుకొని వేకువజామున 4 గంటల నుంచే బారులు తీరారు.



క్రీడా స్ఫూర్తి చాటాలి

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి చాటాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం

32.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

న్యాయశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్యారం ఆడుతున్న జిల్లా జడ్జి సునీత

ఆదిలాబాద్‌టౌన్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లా న్యాయశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో చెస్, క్యారం, వాలీబాల్ పోటీలు నిర్వహించగా ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవీకృష్ణ స్వయంగా క్యారం ఆడి ప్రారంభించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లుగా వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా న్యాయమూర్తి ప్రమీలజైన్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, మొబైల్ కోర్టు న్యాయమూర్తి యశ్వంత్ సింఘ్ చౌహాన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సూర్యకాంత్, బీఎస్.మూర్తి, న్యాయవాదులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

24న స్వచ్ఛ పెయింటింగ్ పోటీలు

కైలాస్‌నగర్: స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఈ నెల 24న స్వచ్ఛ ఆదిలాబాద్ పేరిట పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం ప్రహరీపై విద్యార్థులు, ప్రొఫెషనల్ పెయింటర్లతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8నుంచి పదో తరగతి విద్యార్థులు ఒక కేటగిరీగా, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు మరో కేటగిరీగా పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పెయింటింగ్‌కు అవసరమైన రంగులను మున్సిపల్ తరఫున ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ప్రొఫెషనల్ పెయింటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రేషన్ బియ్యంపై అపోహలు వద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

బోథ్: రేషన్ దుకాణాల ద్వారా సరఫరా అవుతున్న బియ్యంపై ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని సాకెర గ్రామ పంచాయతీ పరిధిలో గల రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఉచిత బియ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్యాంసుందర్, ఉపసర్పంచ్ భిక్కులాల్, ధరావత్ రమేశ్, భీంరావ్, నానాజీ, ధన్‌రాజ్, తదితరులున్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి నేడు రాత పరీక్ష

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల డీలర్ల భర్తీకి సంబంధించి ఈ నెల 22న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రమేశ్‌రాథోడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

లెనిన్ ఆశయాలను సాధించాలి

ఎదులాపురం: లెనిన్ ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తొడసం భీంరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో శనివారం లెనిన్ వర్ధంతిని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెట్టుబడి దారి వ్యవస్థ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం చూపలేదని, అది కేవలం సోషలిజం వల్ల మాత్రమే సాధ్యమని లెనిన్ ఉద్ఘాటించారన్నారు. కార్యకర్తలు ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, నాయకులు స్వామి, కె.ఆశన్న, జమున, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబాకు మహాభిషేకం



హారతి తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మార్గమధ్యంలో పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు







ఆలయం వద్ద భక్తుల సందడి

- అర్ధరాత్రి మెస్రం వంశీయుల పూజలు
- కొత్త కోడళ్ల భేటింగ్
- తరలివచ్చిన ఆదివాసీలు
- భక్తజన సంద్రంగా కేస్లాపూర్
- ప్రారంభమైన జాతర

ఉట్నూర్/ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా సంబురం మొదలైంది. ఆచార సంప్రదాయాలు పాటిస్తూ మెస్రం వంశీయులు శనివారం అర్ధరాత్రి పవిత్ర గంగాజలాలతో నాగోబాను అభిషేకించడంతో జాతర ఘట్టం ప్రారంభమైంది. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులతో కేస్లాపూర్ భక్త జనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చారు.

ఉదయం నుంచే ప్రత్యేక పూజలు..

నాగోబా ఆలయ సమీపంలోని వడమర(మర్రిచెట్ల) వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు, పెద్దలు(పటేళ్లు) ఉదయం నుంచి సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామున 84 మందికి తూమ్ (చనిపోయిన వారికి కర్మకాండలు) నిర్వహించి నాలుగు సార్లు సంప్రదాయ వాయిద్యాలు వాయించారు. ఉదయం 10.30 గంటలకు నాగేంద్రుడి విగ్రహంతో ఆలయానికి చేరుకున్నారు. సిరికొండ నుంచి తెప్పించిన కుండలకు మెస్రం పెద్దలు పూజలు చేశారు. వంశంలోని 22 తెగలకు చెందిన ఆడపడుచులు తమ వంశ పెద్దలు, పూజారులకు పాదాభివందనం చేశారు. నాయక్‌పోడ్(నైవేద్యం తయారు చేసేవారు) నుంచి మట్టి కుండలు స్వీకరించారు.

పవిత్ర జలాలతో...

మట్టి కుండలు స్వీకరించిన మెస్రం మహిళలు, ఆడపడుచులు వడమర (మర్రిచెట్ల) సమీపంలోని కోనేరు నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. నాగోబా సన్నిధిలో గతేడాది నిర్మించిన మట్టి పుట్టలను మెస్రం వంశ అల్లుళ్లు తొలగించారు. దాని స్థానంలో మెస్రం వంశ ఆడపడుచులు ఆవు పేడ, పవిత్ర జలాలు, మట్టి మిశ్రమంతో కొత్తగా పుట్టలను తయారు చేశారు. ఈ మట్టితో తయారు చేసిన ఉండలను మహిళల చేతుల మీదుగా తరలించి సతీదేవతల ముందు ఏడు వరుసల భౌల తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పుట్టలకు ప్రత్యేక పూజలు చేస్తూ కిక్రీ, డోలు తదితర వాయిద్యాలు సంప్రదాయ బద్ధంగా వాయిస్తూ పెద్దలు కచేరి నిర్వహించారు. సాయంత్రం మర్రిచెట్ల వద్ద విడిది చేసిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని గోవాడా (గుండ్రంగా గోడకట్టి ఉండే ప్రదేశం) చేరుకుని 22 కితలలో విడిది చేశారు. అభిషేక ఘట్టం ముగిసేంత వరకు ఇక్కడేఉండి పూజలు నిర్వహించడంఆనవాయితీ.

అర్ధరాత్రి పూజలతో...

మెస్రం వంశీయులు ఈనెల 1న గంగాజలం కోసం పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. జన్నారం మండలం కలమడుగు గోదావరి నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో శనివారం అర్ధరాత్రి నాగోబాను అభిషేకించి మహాపూజ నిర్వహించారు. అనంతరం భేటింగ్ కాని మెస్రం వంశ కోడళ్లతో సతీదేవతల పూజలు చేయించారు. తర్వాత వారిని మెస్రం వంశీయులకు పరిచయం (భేటింగ్) నిర్వహించారు. ఈ తంతుతో వీరిని మెస్రం వంశీయులుగా గుర్తిస్తూ తమ ఆరాధ్యదైవం నాగోబా దర్శనం కల్పించారు. మహాపూజకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం జాతర ప్రారంభమైనట్లు ఆదివాసీలు భావిస్తారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేఖానాయక్, ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావ్, జెడ్పీటీసీ అర్క పుష్పలత, ఎంపీపీ పోటె శోభాబాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, జిల్లా, ఐటీడీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు కేస్లాపూర్‌కు కేంద్ర మంత్రి..

కైలాస్‌నగర్: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా ఆదివారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు రానున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో కేస్లాపూర్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. నాగోబాను దర్శించుకుని ఆలయంలో పూజలు నిర్వహించడంతోపాటు స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారని వెల్లడించారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో ఆలయ సమీపంలో అధికారులు హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



మెస్రం వంశీయులకు పరిచయం చేస్తున్న పరధాన్ సమాజ్



మట్టి ఉండలతో భౌల తయారు చేస్తున్న మెస్రం వంశ మహిళలు



గంగా జలానికి పూజలు చేస్తున్న వంశీయులు



కోనేరు వద్ద జలాన్ని కుండలలో నింపుతూ..

10,361 మందికి కంటి పరీక్షలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ కలెక్టర్ నటరాజ్

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: జిల్లాలో రెండు రోజులుగా నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరాల్లో 10,361 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 1520 మందికి రీడింగ్ కళ్లద్దాలు అందించామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి శనివారం హైదరాబాద్ బీఆర్కే భవన్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులతో కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 1,758 మందికి ప్రిస్కిప్షెడ్ అద్దాలకు సిఫారసు చేసినట్లు తెలిపారు. జిల్లాకు 30 వేల రీడింగ్ గ్లాసులు అందాయన్నారు. రెండు బఫర్ బృందాల ద్వారా కలెక్టరేట్ ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీస్, కోర్టు సిబ్బంది, జైలులో ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేస్తామని వివరించారు. సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ, అడిషనల్ కలెక్టర్ ఎస్.నటరాజ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలు అరికట్టాలి

పిల్లల అక్రమ రవాణా, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో పిల్లల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లల అక్రమ రవాణా, మత్తు పదార్థాల వినియోగాన్ని పోలీస్ యంత్రాంగం సహకారంతో నిరోధించాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో మత్తు పదార్థాలు, పానీయాల అమ్మకాలు సాగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీడబ్ల్యూవో మిల్కా, గిరిజన సంక్షేమ డీడీ దిలీప్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ భూములను పరిరక్షించాలి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆక్రమణకు గురవుతున్న సీసీఐ భూములను పరిరక్షించాలని కోరుతూ సీసీఐ సాధన సమితి నాయకులు శనివారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ.. రెవెన్యూ, పరిశ్రమలశాఖ అధికారులు భూసర్వే చేపట్టి భూముల హద్దులు నిర్ణయించాలన్నారు. సీసీఐ జీఎం పరిశ్రమకు సంబంధించిన ఇనుప వస్తువులు, మోటర్లు, కలప, సున్నపురాయిని సైతం అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఓ రైతు వద్ద సీసీఐ లీజు భూమిని కొనుగోలు చేశామనే నెపంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చే స్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకుని సీసీఐ ఆస్తులను కాపాడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సమితి కన్వీనర్ మల్లేశ్, కోకన్వీనర్ నారాయణ, అరవింద్, రమేశ్, అరుణ్ కుమార్ తదితరులున్నారు.

ఆదిలాబాద్ పురోగతికి నాంది

- పారిశ్రామిక అభివృద్ధిలో ఐటీ కంపెనీ స్టార్టప్‌ల దోహదం
- ఆహ్లాదకర వాతావరణంలో సీఐఐ తెలంగాణ సదస్సు
- ఉత్సాహంగా పాల్గొన్న ఐటీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు
- పెట్టుబడులకు ముందుకు రావాలని పిలుపు



సీఐఐ తెలంగాణ సదస్సులో పాల్గొన్న ఐటీ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహికులు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు ఉపయోగించుకుని పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఆదిలాబాద్ పురోగతికి నాంది పలకడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని పలువురు ఐటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఐటీ సేవలపై కాన్ఫిడిరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పంచవటి హోటల్‌లో శనివారం సదస్సు నిర్వహించారు. ఆదిలాబాద్ ఐటీ కంపెనీ బీడీఎన్‌టీ చైర్మన్ సంజీవ్ దేశ్‌పాండే సౌజన్యంతో నిర్వహించిన సదస్సుకు విజయ్‌రంగినేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే వివిధ ప్రాంతాల్లో స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన ప్రతినిధులు భాగస్వాములయ్యారు. ఐటీ కంపెనీ ప్రతినిధి జె.రవీందర్‌రావు, నాట్ సీఈవో వేదాంత్ పడిగేలవార్, జోగు మహేందర్, పారిశ్రామిక వేత్త రాజు చింతావార్, బీడీఎన్‌టీ ఆదిలాబాద్ డైరెక్టర్ ప్రణవి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ టవర్‌కు రూ.40 కోట్లు



ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ఏర్పాటుకు రూ.40 కోట్లతో బిల్డింగ్ నిర్మించనున్నాం. స్థలంకూడా కేటాయించాం. టవర్ డిజైన్‌కు ఆమోదం లభించాల్సి ఉంది. స్థానిక అవసరాలకు ఐటీ టవర్లు ఉపయోగపడాలి. ఇందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది. మంచి ఇన్నోవేషన్‌లతో స్థానికులు ముందుకు రావాలి. బీడీఎన్‌టీ ఇక్కడ 750 మందికి పొజిషన్ కల్పిస్తామని చెప్పింది. ఇందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది. – విజయ్‌రంగినేని, రాష్ట్ర ఐటీ ఇన్వెస్టిమెంట్స్ సీఈవో

స్థానికులు పెట్టుబడి పెట్టాలి



నిజామాబాద్‌లో ఒకతను రైతులను ప్రోత్సహించి పంట పండించేందుకు ఆర్థిక సహకారం అందించారు. ఆ దిగుబడులను ఆయన విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా తాను ప్రయోజనం పొందడంతో పాటు రైతులకు తోడ్పడుతున్నారు. ఐటీ స్టార్టప్‌లు ఈ దిశగా ఆలోచన చేసి ముందుకు రావాలి. స్థానికులు దీంట్లో పెట్టుబడి పెడితే బయటవారు కూడా ఆసక్తికనబరిచి ఇన్వెస్టిమెంట్లకు ముందుకు వస్తారు.

– సంజీవ్ దేశ్‌పాండే, కన్వీనర్ ఐటీ అండ్ స్టార్టప్స్ ప్యానల్, సీఐఐ తెలంగాణ

ప్రోత్సాహం అందిస్తే పలువురు ముందుకు..



జిల్లాకు చెందిన నేను హైదరాబాద్‌లో స్టార్టప్ కంపెనీ నిర్వహిస్తున్నా. గతంలో అమెరికాలో ఉన్నప్పుడు బీడీఎన్‌టీ చైర్మన్ దేశ్‌పాండే కంపెనీలో బాధ్యతలు నిర్వర్తించా. ఆయన మాతృస్థలం ఆదిలాబాద్‌పై మక్కువతో ఇక్కడ ఐటీ కంపెనీ స్థాపించారు. పలువురికి ప్రోత్సాహం అందిస్తున్నారు. స్థానికులు పెట్టుబడులకు ముందుకు వస్తే ఆదిలాబాద్‌లో ఐటీ సేవలు విస్తరిస్తాయి.

–డాక్టర్ రాఘవరావు, స్టార్టప్ ప్రతినిధి

సభ్యుల సంఖ్య పెరగాలి



తెలంగాణ సీఐఐ పరంగా 300 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. ఈ సంఖ్య మరింత పెరగాలి. పారిశ్రామికీకరణ కు ఔత్సాహికులు తోడ్పాటు అందించాలి.

– వి.రామకృష్ణ, సీఈవో, జోరమ్ టెక్నాలజీస్

పలు స్టార్టప్‌లు నిర్వహిస్తున్నా..



మహారాష్ట్రలోని పూణేలో నేను శ్రీయాన్ష్ టెక్నాలజీస్ పేరిట పలు స్టార్టప్‌లు నిర్వహిస్తున్నాను. అంతర్జాతీయంగా వాటికి ప్రశంసలు దక్కాయి. నేను ఆదిలాబాద్ జిల్లా వాసినే.

–ప్రశాంత్ రంజల్కర్, సీఈవో శ్రీయాన్ష్ డీటీ పూణే

స్థానికులకు ఉపాధి అవకాశాలు



స్థానిక వనరులు ఉపయోగించుకుని ఇక్కడి యువతకు ఉపయోగపడే విధంగా స్టార్టప్‌లు దోహదం అందించాలి. ఐటీ టవర్‌కు మూడెకరాల స్థలం కేటాయించాం.

–ప్రేమేందర్,మున్సిపల్ చైర్మన్, ఆదిలాబాద్

క్లుప్తంగా

గుబిడిపల్లి శివారులో చిరుత సంచారం

- అడవిపంది, కుక్కను హతమార్చిన వైనం

తాంసి(బోథ్): భీంపూర్ మండలం గుబిడిపల్లి శివారులో ఇటీవల చిరుతపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి పంటచేలకు కాపలాగా వెళ్లిన రాజీఘడ్ గ్రామానికి చెందిన రైతు సంతోష్‌కు చిరుతపులి కనిపించినట్లు తెలిపాడు. శనివారం ఉదయం పంటచేలలో అడవి పంది, శునకం కళేబరాలు గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సెక్షన్ అధికారి ప్రేంసింగ్ ఘటన స్థలాన్ని సందర్శించారు. అడవిపంది కళేబరాన్ని పరిశీలించి చిరుతపులి హతమార్చినట్లు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీప్రాంతానికి సమీపంలో పంటచేలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతపులి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

చిరుత దాడిలో నీలుగాయి హతం

కడెం: మండంలోని గంగాపూర్‌లో చిరుతపులి దాడిలో నీలుగాయి హతమైనట్లు ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. గంగాపూర్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం అటవీ సిబ్బందికి నీలుగాయి మృతదేహం కనిపించింది. పరిశీలించగా చిరుతపులి దాడి చేసి హతమార్చినట్లు ధ్రువీకరించినట్లు ఆమె పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో సత్తాచాటిన శ్రీవల్లి



బహుమతి అందుకుంటున్న శ్రీవల్లి

నిర్మల్‌టౌన్: మహబూబాబాద్‌లోని మరిపెడ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి అండర్–17 బ్యాడ్మింటన్ పోటీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థిని సత్తా చాటింది. సింగిల్ విభాగంలో జిల్లా కేంద్రంలోని రవి హై స్కూల్‌కు చెందిన శ్రీవల్లి ప్రథమ బహుమతి సాధించింది.

యువతి ఆత్మహత్య



శ్రీయ మృతదేహం

ఉట్నూర్‌రూరల్ (ఖానాపూర్): అనారోగ్యంతో బాధపడుతూ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. యువతి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని సెరికల్చర్ క్వార్టర్‌లో నివాసం ఉంటున్న గొల్ల శ్రీయ (17) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెందిన యువతి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి గొల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.





గోదావరినదిలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

సాయి.. శరణం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివసాయి సమాజ్ జంగల్‌హన్మాన్ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం సాయి పల్లకిసేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవ మూర్తిని పల్లకిలో ఉంచి ఆలయం నుంచి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపు దారి పొడవునా సాయి నామ స్మరణతో మారుమోగింది. శోభాయాత్రలో ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొని పల్లకి మోశారు. భక్తుల సాయి గీతాలాపనలు, యువతీ, యువకుల నృత్యాలు, మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక గోదావరి తీరంలో సాయిబాబా ఉత్సవమూర్తికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద సాయి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అజ్మీరా శ్యాంనాయక్, అంకం రాజేందర్, కొక్కుల ప్రదీప్, రామునాయక్, రాచమల్ల రాజశేఖర్, శేఖరయ్య, కిశోర్, విలాస్, శ్రీనివాస్, రాజేశ్వర్, గంగాధర్, వెంకటప్పయ్య, అశోక్‌రావు, బీసీ రాజన్న, శరత్‌రావు, సంతోష్, నారాయణ, మల్లేశ్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి



నాగోబా జాతరలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఇంద్రవెల్లి(ఖానాపూర్): నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కేస్లాపూర్‌ను సందర్శించి ఆలయ ప్రాంగణంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఆర్టీసీ బస్‌స్టాప్, క్రీడా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, పోలీసు కంట్రోల్ రూమ్, హెలిప్యాడ్, భక్తుల క్యూలైన్, బారీకేడ్లు, ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో సురేశ్, ఏపీవో ఆత్రం భాస్కర్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, ఆలయ ఈవో రాజమౌళి, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఈఈ రాథోడ్ భీంరావ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏవో రాంబాబు ఉన్నారు.

దుకాణ సముదాయాలు

పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని శనివారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. దీంతో వ్యాపారులు జాతర ప్రాంగణంలో దుకాణ సముదాయాలు, రంగులరాట్నాలు, సర్కస్ ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. జాతరలో అగ్నిప్రమాదాలు జరిగితే అదుపుచేసేందుకు ముందస్తుగా ఫైరింజన్లను అందుబాటులో ఉంచారు. ఈ నెల 24న నిర్వహించనున్న నాగోబా దర్బార్ ఏర్పాటు పనులు ముమ్మరం చేశారు.



జాతరలో అందుబాటులో ఉంచిన ఫైరింజన్



ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, సర్కస్

ఎండుగడ్డి పంపిణీ

నాగోబా మహాపూజకు వచ్చిన మెస్రం వంశీయుల ఎడ్లకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వరిగడ్డి పంపిణీ చేసినట్లు పశువైద్యుడు సుదేశ్‌కుమార్ తెలిపారు.

శాంతి భద్రతల కోసమే కవాతు

జైనథ్(ఆదిలాబాద్): శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కవాతు నిర్వహిస్తున్నామని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండర్ శశాంక్ శేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో కవాతు చేపట్టారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడ్ కమాండర్ సీఐ విక్రమ్ ఠాకూర్, జైనథ్ సర్కిల్ సీఐ నరేష్, ఎస్సై పెర్సిస్ బిట్ల, సర్పంచ్ దేవన్న, ఉపసర్పంచ్ రాకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శశాంక్ శేఖర్

పుణ్యక్షేత్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

ఉట్నూర్(ఖానాపూర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ దేవతలు ఉన్న పుణ్యక్షేత్రాల వద్ద అన్నిరకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడిమెత తిరుపతి శనివారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ పుణ్యక్షేత్రాల వద్ద విద్యుత్, తాగునీరు, రోడ్లు ఇతర సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలన్నారు. పెర్సపేన్ దేవతలకు ఆలయాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.



పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రతిఒక్కరూ బుద్ధుడిమార్గంలో నడవాలి

భైంసా: ప్రతి ఒక్కరూ బుద్ధుడి మార్గంలో నడవాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధభిక్షువు దీపాంకర్ జీథేరో అన్నారు. శనివారం పట్టణంలోని ఏపీనగర్ బుద్ధ విహార్‌లో బౌద్ధభిక్షువుల ప్రవచన కార్యక్రమాన్ని బీఎస్ఐ భైంసా శాఖ అధ్యక్షుడు ప్రసంజీత్ హేమ్లే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, గౌతమబుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుచుకొని శాంతి స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభాకర్, గంగాధర్, నారాయణ్, సాయిలు మైసేకర్, గౌతం పింగ్లే, భీమ్‌రావుడోంగ్రే, ఆనంద్ రావు గంగాధర్ దగ్డే, ప్రసంజీత్ అగ్రే, శంకర్ చంద్రే, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: లోకేశ్వరం మండలంలోని కనకాపూర్‌లో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు గంగాధర్ మాట్లాడుతూ ఈ నెల 29న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, విహార్ కమిటీ అధ్యక్షుడు కుంటొల్ల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పోచమ్మ సన్నిధిలో గంగనీళ్ల జాతర

లక్ష్మణచాంద(నిర్మల్): నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామంలో శనివారం గంగనీళ్ల జాతర నిర్వహించారు. ఆదివారం బోనాల సందర్భంగా వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగనీళ్ల జాతరను నిర్వహించారు. గ్రామస్తులతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు ధర్మారం సమీపంలోని గోదావరికి వెళ్లి పవిత్ర గోదావరి జలాలను సేకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఆడపడుచులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం మహా పోచమ్మకు అభిషేకం చేశారు. తర్వాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ధర్మన్న, వీడీసీ సభ్యులు సుమన్, భరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం(ముథోల్): మండలంలోని పంచుగుడి, ధర్మోర గ్రామాల్లోని వీడీసీ ఆధ్వర్యంలో గంగనీళ్ల జాతర శనివారం నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా పంచగుడి గ్రామ శివారులోని గోదావరి నదికి వెళ్లారు. నదిలో పుణ్యస్నానాలు చేసి పవిత్ర జలాలతో ఊరేగింపుగా గ్రామానికి చేరుకున్నారు. మహిళలు వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆ జలాలతో గ్రామదేవతలకు అభిషేకం చేశారు. తర్వాత పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఎల్లన్న, శారద, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, పంచగుడి వీడీసీ సభ్యులు రాజరారెడ్డి, భోజారెడ్డి, భోజప్ప, శాల నారాయణ, సాయిలు, లింగన్న ధర్మోర వీడీసీ సభ్యులు ఆజోబ పటేల్, ఆసీబొద్దీన్ పటేల్, సాహెందర్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.



గంగనీళ్లతో వస్తున్న ధర్మారం గ్రామస్తులు



ధర్మోరలో గంగనీళ్ల జాతరలో పాల్గొన్న భక్తులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



పంచనామా పరిశీలిస్తున్న తహసీల్దార్

గుడిహత్నూర్(బోథ్): గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ నైలు నాయక్ తెలిపారు. జన్నారం మండలంలోని చింతగూడకు చెందిన మడుగుల ప్రజ్యోత్, కరీంనగర్‌కు చెందిన కోడి సాయిరామ్ తాము చదువుకునే రోజుల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గంజాయికి అలవాటు పడ్డారు. చదువు ముగిసిన తర్వాత వేరే పనుల్లో స్థిరపడ్డా సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి విక్రయించడమే సరైన మార్గమని అనుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి వచ్చి కేఆర్‌కే కాలనీకి చెందిన సమీర్ అలియాస్ గుడ్డూ అనే యువకుని ద్వారా 500 గ్రాముల గంజాయిని తీసుకొని కరీంనగర్‌కు బయలు దేరారు. శనివారం గుడిహత్నూర్ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద లభించిన గంజాయిని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట హాజరు పరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సూత్రావే గోపాల్ అనే వ్యక్తి ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం గోపాల్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఒకరి అరెస్ట్

నిర్మల్‌టౌన్ : టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. టిప్పు సుల్తాన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ షాహిద్ అలియాస్ ముక్తాదిర్ అధ్యక్షతన పట్టణంలోని వీధుల గుండా నిర్వహించిన ర్యాలీలో ఒక వర్గానికి చెందిన ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా స్లొగన్స్ ఇచ్చారు. దీంతో గతంలోనే అతనిపై కేసు నమోదు కాగా శనివారం అరెస్టు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎదులాపురం: పట్టణంలోని గోదాంపై దాడిచేసి ఆరుక్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మహాలక్ష్మివాడకు చెందిన షేక్ సత్తార్ పట్టణంలోని తిర్పెల్లిలోని గోదాంలో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. త మకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి షేక్ సత్తార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



మాట్లాడుతున్న మోహన్‌పటేల్



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

- బీజేపీ నేత మోహన్‌పటేల్
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం కుభీర్‌లో ధర్నా

కుభీర్(ముథోల్): పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో కుభీర్ వివేకానంద చౌక్‌లో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మోహన్‌పటేల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చ లేదని పేర్కొన్నారు. రైతుల రుణాలు మాఫీ కాలేదని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, డబుల్ బెడ్రూం హామీ నిలబెట్టుకోలేదని వివరించారు. కుటుంబ పాలన సాగిస్తూ కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు నియోజకవర్గాన్ని ఇద్దరు ఎమ్మెల్యేలు పాలించారని, అయినా అభివృద్ధి జరుగలేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా, ఆయుష్మాన్ భారత్ స్కీంలు అమలు చేయడం లేదన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులతో పేదలకు 2 లక్షల ఇళ్లు నిర్మించిందని తెలిపారు. తెలంగాణలో 2.40 లక్షల ఇళ్ల కోసం కేంద్రం రూ.1300ల కోట్లు ఇస్తే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, మండల మాజీ అధ్యక్షుడు సుభాష్ జాదవ్, న్యాయవాదులు సాయినాథ్, గణపతి, సర్పంచులు జాదవ్ అర్చన, సునీతజాదవ్, ఆనంద్‌రావ్ పటేల్, నాయకులు పుప్పాల లింగం, కల్మేష్, గోపీచంద్, పండిత్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ మున్సిపాలిటీ కోసం తీర్మానం

ముథోల్: మండల కేంద్రం ముథోల్‌ను మున్సిపాలిటీ చేయాలని గ్రామసభలో శనివారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సర్పంచ్ వెంకటపురి రాజేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముథోల్‌ను మున్సిపాలిటీ చేసేలా అధికారులు ప్రగతి నివేదికలు ప్రభుత్వానికి పంపాలని కోరారు. వేసవి సమీపిస్తున్నందున మిషన్ భగీరథ పనులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని మరో తీర్మానం చేశారు. కార్యక్రమంలో అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు

9 మంది హెల్త్ ప్రొవైడర్లకు పోస్టింగ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వివిధ సబ్ సెంటర్లలో తొమ్మిది మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించారు. ఇదీ వరకే అభ్యర్థులను ఎంపిక చేయగా శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయ ఛాంబర్‌లో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో వారికి కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ కల్పించారు.

యువకుడి ఆత్మహత్య

నార్నూర్: మండలంలోని బలాన్‌పూర్‌లో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. గ్రామానికి చెందిన అడ ధర్మ, భాగుబాయి దంపతుల కుమారుడు అడ పరశురాం(22) ఏడాది క్రితం కరీంనగర్‌లో కూలీ పని చేయడానికి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం మృతుని సోదరుడు పొలానికి వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండ చిలువ హతం



జైనథ్(ఆదిలాబాద్): మండల కేంద్రంలో శనివారం గ్రామస్తులు కొండ చిలువను హతమార్చారు. మండల కేంద్రానికి చెందిన లక్కం సునీల్ పంటచేలో కొండ చిలువ కనిపించడంతో భయాందోళన చెంది సమీపంలోని రైతుల ను పిలవడంతో వారు వచ్చి కొండ చిలు వను హతమార్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.